

- శివ నామస్మరణతో మార్మోగిన శ్రీగిరి
- అశేష భక్తజనం నడుమ రథోత్సవం
- కన్నులపండువగా తెప్పోత్సవం

శోభాయమానం
ఆదిదేవుడి రథోత్సవం



శ్రీశైలం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీగిరిపై బ్రహ్మోత్సవ రథాన్ని అధిరోహించిన మల్లికార్జునుడు భ్రమరాంబ సమేతుడై అశేష భక్తజనం కోలాహలం నడుమ విహరించారు. గురువారం సాయంత్రం రథశాల వద్ద కలెక్టర్ రాజకుమారి, ఈవో శ్రీనివాసరావు, ఎస్పీ విక్రాంత్ పాటిల్ సమక్షంలో ఆలయ అర్చకులు రథానికి రథాంగపూజ, రథాంగహోమం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దేవాలయ ప్రాంగణంలో విశేష అర్చనలు, హారతులు అందుకున్న స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో రాజగోపురంమీదుగా రథశాల వద్దకు మేళతాళాలు, భజంత్రీల నడుమ తీసుకొచ్చారు. పుష్ప ప్రియుడైన మల్లయ్యకు సుగంధ పుష్పాలు, పరిమళ ద్రవ్యాలతో అలకంరించిన రథంపై ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి సాత్వికబలిగా కొబ్బరికాయలను, గుమ్మడికాయలను సమర్పించారు. గంగాధర మండపం నుంచి నంది మండపం దాకా, అక్కడి నుంచి తిరిగి గంగాధర మండపం దాకా రథోత్సవం సాగింది. రథంపై ఆదిదేవుడు ఆశీనులై సాగుతుండగా... ఓం నమఃశివాయ నామస్మరణతో అశేష భక్తులు శివనామస్మరణ చేస్తూ ఆదిదేవుడి వైభవాన్ని వీక్షించారు.





తెపోత్సవంలో స్వామి, అమ్మవార్ల వైభోగం..



రథోత్సవంలో పాల్గొన్న కలెక్టర్



నేత్రపర్వంగా తెప్పోత్సవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు. కార్యక్రమంలో ముందుగా ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం పుష్పాలంకృత పల్లకిలో ఊరేగింపుగా ఆలయ రాజగోపురం మీదుగా వెలుపలికి తోడ్కొని వచ్చి మేళతాళాల నడుమ పుష్కరిణి వద్ద ఏర్పాటు చేసిన తెప్పపై ఆశీనులను చేసి విశేష పూజాదికాలు చేశారు.

నేడు పూర్ణాహుతి : మహాశివరాత్రి బ్రహ్మోత్సవ క్రతువులకు శుక్రవారం పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఉదయం 8 గంటలకు యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించి అనంతరం కలశోద్వాసన, అవబృథం, త్రిశూలస్నానం, వసంతోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం ధ్వజావరోహణ చేయనున్నారు.



రథోత్సవం ఎదుట నాగసాధువులు



పల్లకి మోస్తున్న ఈవో, ఆలయ అర్చకులు



గిరిజన సంప్రదాయ నృత్య ప్రదర్శన

కల్యాణ వైభోగమే

ఘనంగా మహానందీశ్వరుడి కల్యాణోత్సవం



కళ్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, పాల్గొన్న ఈవో దంపతులు

మహానంది, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున మహానందీశ్వర స్వామి, కామేశ్వరీదేవిల కల్యాణోత్సవం వైభవంగా సాగింది. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, విజయ దంపతులు పట్టు వస్త్రాలను కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి 6 గంటల వరకు కల్యాణ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డీఓ చల్లా విశ్వనాథ్, ఏఈఓ యర్రమల్ల మధు తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై ఆది దంపతులు

బ్రహ్మోత్సవాల్లో మహానందీశ్వర స్వామి, కామేశ్వరీదేవి అమ్మవారు గురువారం ఉదయం శేషవాహనంపై విహరించారు. అదేవిధంగా రాత్రి పుష్ప పల్లకి సేవను వేదపండితులు నిర్వహించారు.



శేషవాహనంపై ఊరేగుతున్న మహానందీశ్వరుడు

యాగంటిలో ఘనంగా బ్రహ్మోత్సవాలు



యాగంటి క్షేత్రంలో ఉమామహేశ్వర స్వామికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె , ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): యాగంటి క్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉమామహేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం గురువారం తెల్లవారుజామున ఘనంగా జరిగింది. ఈఓ చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి, ప్రధాన అర్చకులు మహేశ్వరశర్మ, కిశోరయ్యల ఆధ్వ ర్యంలో జరిగిన కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. ఆర్యవైశ్య అన్నదానసంస్థ అధ్యక్షుడు నాగ రాజు, యాగంటి ఆలయ సిబ్బంది ప్రసాద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి

బనగానపల్లె, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్ని సమస్యలను సంబంధిత అధికారులకు చేరవేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలనుంచి వచ్చిన అర్జీలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అప్పటికప్పుడే పరిష్కరిస్తామన్నారు.

కేశవ్.. కరుణ చూపేనా..?



అసంపూర్తిగా ఆగిన మెడికల్ కళాశాల భవనం

- సాగునీటి ప్రాజెక్టులకు రూ.3,264 కోట్ల ప్రతిపాదన
- అసంపూర్తి ఉర్దూ వర్సిటీపై దయ చూపాలి
- నేడు అసెంబ్లీలో 2025-26 బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

కర్నూలు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలో కొలువుదీరిన టీడీపీ కూటమి ప్రభుత్వం శుక్రవారం 2025-26 బడ్జెట్ శుక్రవారం (నేడు) అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బాధ్యతలు చేపట్టాక ప్రవేశపెట్టే సంపూర్ణ బడ్జెట్ ఇది. ఇప్పటికే వివిధ శాఖలు, జిల్లాల వారీగా ప్రతిపాదనలు తెప్పించుకొని పద్దుల వారిగా అంకెల కూర్పు సిద్ధం చేశారు. వార్షిక బడ్జెట్ ఆమోదం కోసం ఉదయం 9 గంటలకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశ అవుతుంది. ఈ తరువాత అసెంబ్లీలో ప్రవేశ పెడుతారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి సహా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు నియోజకవర్గాల వారీగా బడ్జెట్ కోసం వినతిపత్రాలు ఇచ్చారు. అదే క్రమంలో జిల్లాలో శాఖవారిగా కూడా ప్రతిపాదనలు తెప్పించుకున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టులకు రూ.3,264 కోట్లు అవసరం ఉందని ఆ శాఖ చీఫ్ ఇంజనీర్లు (సీఈ) ప్రతిపాదించారు. క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలో పరిశోధన కేంద్రం (రీసెర్చ్ సెంటర్) ఏర్పాటుకు రూ.150 కోట్లు అడిగారు. గ్రామీణ రోడ్ల అభివృద్ధి, పేదల పక్కా గృహాలు సరేసరి. ఉమ్మడి కందనవోలు జిల్లాపై విత్త మంత్రి పయ్యావుల కేశవ్ కనికరం చూపాల్సి అవసరం ఎంతైనా ఉంది.

రూ.3,264 కోట్లు కేటాయించాలి


కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 9.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టులు, కాలువలు నిర్వహణ, అసంపూర్తి ప్రాజెక్టులకు రూ.1,200 కోట్లు అవసరం ఉందని అంచనా వేస్తే.. ప్రభుత్వం సూచనమేరకు రూ.924 కోట్లు ఇవ్వాలని జలవనరుల శాఖ ప్రాజెక్ట్ సీఈ కబీర్‌బాషా ప్రతిపాదనలు పంపారు. శ్రీశైలం ప్రాజెక్టుకు రూ.55 కోట్లు, టీబీపీ ఎల్లెల్సీ, వేదావతి, ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ ఆఫ్ అకౌంట్ కింద రూ.250 కోట్లు, కేసీ కెనాల్, కుందూ నది విస్తరణకు కోసం రూ.180 కోట్లు, రాజోలి, జొలదరాశి ప్రాజెక్టులకు రూ.40 కోట్లు, ఎస్సార్బీసీ కాలువకు రూ.40 కోట్లు, గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు రూ.30 కోట్లు, గాజులదిన్నె ప్రాజెక్టుకు రూ.28 కోట్లు, హంద్రీనీవా కాలువ నుంచి 68 చెరువులకు నీటిని ఎత్తిపోసే పథకానికి రూ.40 కోటు కేటాయింపులు చేయాలని కోరారు. అలాగే.. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.3,500 కోట్లు కేటాయించాలని అనంతపురం సీఈ నాగరాజు ప్రతిపాదించారు. అందులో కర్నూలు జిల్లాలో విస్తరణకు రూ.690 కోట్లు అవసరం ఉంది. గాలేరు-నగరి ప్రాజెక్టుకు రూ.3,500 కోట్లు కావాలని తిరుపతి సీఈ మల్లికార్జునరెడ్డి ప్రతిపాదనం పంపారు. అందులో నంద్యాల జిల్లాలో పనులకు రూ.450 కోట్లు అవసరం ఉంది. ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టుకు రూ.5,400 కోట్లు కేటాయింపులు చేయాలని కడప సీఈ శ్రీనివాసులు ప్రతిపాదించారు. నంద్యాల జిల్లాకు రూ.1,200 కోట్లు కావాలి.

వర్సిటీలపై దృష్టి సారించాలి

● రాష్ట్రంలో ఏకైక ఉర్దూ యూనివర్సిటీ డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వావిద్యాలయం. నవ్యాంధ్రలో అత్యధికంగా ముస్లిం జనాభా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఉన్నారని గుర్తించి 2017-18లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కర్నూలులో ఏర్పాటు చేసింది. ఓర్వకల్లు వద్ద 144.92 ఎకరాల్లో శాశ్వత భవనం నిర్మాణం కోసం ఫేజ్-1 కింద అడామిక్ బ్లాక్, బాలికల హాస్టళ్లు, విశాలమైన రోడ్లు నిర్మాణాలు రూ.18 కోట్లతో చేపట్టారు. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యంగా వదిలేసింది. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో ఆశలు చిగురించాయి. ఈ బడ్జెట్‌లో సిబ్బంది జీతాలు, నిర్వహణ, శాశ్వత భవనాలు నిర్మాణాల కోసం రూ.31.26 కోట్లు ఇవ్వాలని వర్సిటీ అధికారులు ప్రతిపాదించారు.

మిగతా 7వ పేజీలో

ఇది విద్యార్థుల పరీక్షల సీజన్. ఇప్పటికే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు, మార్చి 17వ తేదీ నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు దగ్గర పడుతుండటంతో విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. కర్నూలు జిల్లాలో 514 పాఠశాలల నుంచి 38,560 మంది, నంద్యాల జిల్లాలో 13,400 మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. అలాగే ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కర్నూలు జిల్లా నుంచి 46,235 మంది, నంద్యాల జిల్లా నుంచి 25,542 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ పరీక్షలే కాకుండా ఏపీఈఏపీ సెట్, నీట్, జేఈఈ-మెయిన్స్, జేఈఈ-అడ్వాన్స్‌డు పరీక్షలు కూడా జరగనున్నాయి. వేసవి వేడిమి ఒక పక్క, పరీక్షల టెన్షన్ మరోపక్క విద్యార్థులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. అయితే కొన్ని జాగ్రత్తలను పాటిస్తే అద్భుత విజయాలు సాధించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.




టెన్షన్ వద్దు

- మెలకువలు పాటిస్తే అద్భుత విజయాలు
- మార్చి 1 నుంచి ఇంటర్.. 18 నుంచి టెన్త్ పరీక్షలు
- అభ్యసనకు ఇదే మంచి సమయం
- తగిన నిద్ర, ఆహారం తీసుకోవాలి
- విద్యార్థులకు విశ్లేషకులు, విద్యావేత్తల సూచన

కర్నూలు ఎడ్యుకేషన్/ కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇది విద్యార్థుల పరీక్షల సీజన్. ఇప్పటికే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు, మార్చి 17వ తేదీ నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు దగ్గర పడుతుండటంతో విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. కర్నూలు జిల్లాలో 514 పాఠశాలల నుంచి 38,560 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. అలాగే 160 జూనియర్ కళాశాలల నుంచి ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 46,235 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ పరీక్షలే కాకుండా ఏపీఈఏపీ సెట్, నీట్, జేఈఈ-మెయిన్స్, జేఈఈ-అడ్వాన్స్‌డు పరీక్షలు కూడా జరగనున్నాయి. వేసవి వేడిమి ఒక పక్క, పరీక్షల టెన్షన్ మరోపక్క విద్యార్థులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. అయితే కొన్ని జాగ్రత్తలను పాటిస్తే అద్భుత విజయాలు సాధించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

పరీక్షకు ముందు రోజు..

- రేపటి పరీక్ష సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని టైమ్‌టేబుల్ తయారు చేసుకోవాలి.
- ఇంతవరకు చదవని అంశాల జోలికి పోరాదు. రాని అంశాన్ని వదిలివేయాలి. వచ్చిన అంశాలనే మననం చేసుకోవాలి.
- రాత్రి పది గంటల తర్వాత చదవడం అంత మంచిదికాదు. ప్రతి విద్యార్థి కనీసం 6 నుంచి 8 గంటలు నిద్రపోవాలి. నిద్రలేమితో పరీక్షకు పోతే అసలుకే మోసం వచ్చే ప్రమాదముంది.
- పరీక్షలకు కష్టపడి చదువుతున్నాం .. అని భావించకుండా ఇష్టపడి చదవాలి. జీవిత లక్ష్యాన్ని ఏర్పరచుకుంటే దానికి 10వ తరగతి మొదటి తొలి మజిలీ అని మరచిపోరాదు.
- ఉపాధ్యాయులు సూచిన ముఖ్యమైన అంశాలను తప్పకుండా చదవాలి.
- పరీక్షల సమయంలో మనో ధైర్యాన్నిమించిన మందు లేదు.



సాధారణ విషయాలు

- పరీక్ష సమయం విలువైంది. ఏ పరీక్షనూ నిర్లక్ష్యం చేయడానికి, వదిలేయడానికి వీల్లేదు.
- మానసిక ఆందోళనకు, భావోద్వేగాలకు గురికారాదు.
- పరీక్షల కాలంలో టీవీ, సినిమాల జోలికి వెళ్లరాదు.
- కాలినడక, సైకిల్, వాహనం, బస్సుపై ప్రయాణించేటప్పుడు ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్త వహించాలి. పరీక్షల మధ్యలో సెలవు వచ్చినప్పుడు ఆటల జోలికి వెళ్లరాదు.
- వేసవి తీవ్రతను తట్టుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఆకుకూరలు, పండ్లు, పండ్ల రసాలు, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.
- ఎక్కువసార్లు తక్కువ మోతాదులో ఆహారం తీసుకోవాలి.
- పరీక్షల కాలంలో మాంసాహారం, కొవ్వుపదార్థాలు, అతివేడి, అతి శీతల పదార్థాలు, స్వీట్లు, మసాలాలకు దూరంగా ఉండడం మంచిది.
- సులభంగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలి.
- ఆరోగ్య విషయంలో ఎలాంటి అశ్రద్ధ పనికిరాదు.
- నిర్లక్ష్యం, కోపం, భయం, అసూయ, ఈర్ష, ద్వేషం, దుఃఖం, బద్ధకం, ఆందోళనలను దరి చేరనివ్వరాదు.
- నలుగురు కలిసి చదవడం, అవసరమైన అంశాలపై గ్రూపుగా చర్చించడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చు. కానీ అనవసర విషయాలు చర్చిస్తే మొదటికే మోసం రావచ్చు.
- పరీక్ష రాస్తున్నప్పుడు జవాబులపై మాత్రమే మనసు కేంద్రీకరించాలి. పరీక్ష హాల్‌లోకి వచ్చే అధికారుల గురించి పట్టించుకోనవసరం లేదు. అలాగే పక్కవాళ్లు ఏం చేస్తున్నారని చూడకూడదు. దానివల్ల సమయం వృథా అవుతుంది.



ఈ సమయమే చాలా కీలకం

విద్యార్థులకు ఈ సమయం కీలకం. కొత్త పరీక్షల వేళలో కొత్త పాఠ్యాంశాల జోలికి వెళ్లరాదు. నేర్చుకున్నవాటినే ఎక్కువసార్లు రివిజన్ చేస్తూ ప్రాక్టీసు చేయాలి. ముందు నుంచి కష్టపడి చదివితే పరీక్షల సమయంలో సులభంగా ఉంటుంది. అయితే సమయాన్ని వృథా చేసి పరీక్షల సమయంలో హైరానా పడు తుంటారు. విద్యార్థులు అతిగా ఆలోచించి ఆందోళనకు గురికాకూడదు. కష్టమైన సబ్జెక్టలను మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు చదవాలి.

- హనుమంతరావు, కర్నూలు ఉప విద్యాశాఖ అధికారి



కొత్త సిలబస్ జోలికి వెళ్లవద్దు

పరీక్షలు దగ్గరపడుతున్నాయి. కొత్త సిలబస్ జోలికి వెళ్లరాదు. జవాబులు నేర్చుకునేటప్పుడు శ్రద్ధ, ఏకాగ్రత అవసరం. చదివేటప్పుడు గతాన్ని గురించి బాధాకరమైన భావనలు, అనుమానాలు, ఆలోచనలు లేకుండా చదువుపైనే దృష్టి నిలపాలి. పరీక్షల సమయంలో సాత్విక ఆహారం తీసుకోవాలి. ప్రతి రోజు 7 గంటల నిద్ర అవసరం. ధైర్యంగా, పాజిటివ్ ఆలోచనలతో చదవాలి. చదవాల్సిన పాఠాలను ముందుగా ప్రణాళిక వేసుకోవాలి. సమయపాలన తప్పకుండా పాటించాలి. గంట చదివిన తరువాత పది నిమిషాలు విశ్రాంతి అవసరం.

- శిరిగిరెడ్డి జయారెడ్డి, సైకాలజిస్టు, హిప్నోథెరపిస్టు



ఒత్తిడిని జయించాలి

విద్యార్థులు ముందుగా ఒత్తిడిని జయించాలి. అప్పుడే పరీక్షలను సులభంగా ఎదుర్కోగలరు. సమయాన్ని వృథా చేయకుండా ముందుకు సాగితే విజయం తథ్యం.

- సంజీవరెడ్డి, ప్రిన్సిపాల్, మోడల్‌స్కూల్, కొలిమిగుండ్ల



సమయాన్ని వృథాగా చేయకూడదు

విద్యార్థులు పరీక్షలకు ముందు అనుమానాలు నివృత్తి చేసుకోవాలి. తెలియని విషయాలపై ఎప్పటికప్పుడు గురువులను సంప్రదించి తెలుసుకోవాలి. ఒత్తిడిని తగ్గించుకోవడానికి బాగా తెలిసిన ప్రశ్నలకు సమాధానం రాయాలి. సమయాన్ని వృథా చేసుకోకూడదు.

- రమణయ్య, ఉపాధ్యాయుడు, పెట్నికోట జడ్పీ స్కూల్



ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

పరీక్షల సమయంలో విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. అందువల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మరోవైపు ఇదే సమయంలో ఎండలు అధికంగా ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నీరు ఎక్కువగా తాగడం వల్ల ఉపశమనం పొందవచ్చు

- డాక్టర్ శివశంకరరెడ్డి, రిటైడ్ డీఎంహెచ్‌వో

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని మూడు నెలల పాటు అంటే మార్చి 1 2025 నుంచి మే నెల 31వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకుడు హిమాన్షు శుక్లా ఉత్తర్వులు జారీ చేసినట్లు కర్నూలు సమాచార శాఖ డీఐపీఆర్వో జయమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లాలో ప్రస్తుతం ఫిబ్రవరి 28 వరకు అక్రిడిటేషన్ కార్డుల వాలిడిటీ ఉన్న పాత్రికేయులకు మార్చి 1 నుంచి మే 31 వరకు పొడిగింపు సౌకర్యం ఉంటుందని తెలిపారు.

పోసాని కృష్ణమురళిపై విచారణ జరిపించాలి

టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా వ్యవహరిస్తూ, 2023 డిసెంబరులో గుంటూరులో జరిగిన నంది నాటక పోటీల్లో అవకతవకలకు పాల్పడిన సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై విచారణ జరిపించాలని, నంది అవార్డు గ్రహీత, కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య డిమాండ్ చేశారు. గురువారం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోసాని కృష్ణమురళి నాటక పోటీల్లో పాల్పడిన అవకతవకలపై రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, చలనచిత్ర అభివృద్ధి సంస్థ మంత్రి కందుల దుర్గేష్‌కు ఒక లేఖ ద్వారా కళాకారులంతా ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. నంది పోటీలకు నియమించే న్యాయ నిర్ణేతల్లో సీనియర్ నటులను కాదని, వైసీపీ విధేయులను ఎంపిక చేసి, తన పక్షపాత ధోరణిని ఆయన నిరూపించుకున్నారని చెప్పారు. తమ టీజీవీ కళాక్షేత్రం సంస్థ ద్వారా నంది పోటీల్లో ప్రదర్శించిన 'శ్రీకృష్ణ కమలపాలిక' నాటకానికి టీడీపీ ముద్రవేసి నంది బహుమతి రాకుండా అన్యాయం చేశారని ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఆత్మకూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ శివార్లలోని శ్రీశైలం రస్తాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సుమిత్ర (26) అనే యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ నారాయణరెడ్డి వివరాల మేరకు.. ఆత్మకూరు మండలంలోని శ్రీపతిరావుపేట గ్రామానికి చెందిన సుమిత్ర ఆత్మకూరు పట్టణంలో తన పని ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సుమిత్ర అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ నారాయణరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడతాం

ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడుతామని ఏపీ స్టేట్ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

గురువారం స్థానిక ఉస్మానియా కళాశాల రోడ్డు పక్కన ఉన్న ఉమర్ అరబిక్ పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించాక ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 102 సంవత్సరాల కింద ఈ పాఠశాలను ఏర్పాటు చేశారని అన్నారు. డా.అబ్దుల్ హక్ అంజ నస్-ఇ-ఇస్లామియా ఆర్గనైజేషన్‌ను స్థాపించారన్నారు. ఈ ఆర్గనైజేషన్ ద్వారా ఎలిమెంటరీ స్కూల్, హై స్కూల్, యునానీ కాలేజీలు నడుస్తున్నాయని అన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సబీహా పర్వీన్, పాఠశాల ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేఆర్ఎంబీని కర్నూలులో పెడితేనే ప్రాజెక్టుల మనుగడ

రాయలసీమ సాగు నీటి సాధన సమితి



నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది యాజమాన్య బోర్డును కర్నూలు ఏర్పాటు చేస్తేనే సీమలో ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ, మనుగడ ఉంటుందని రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కేఆర్ఎంబీని కర్నూలులో కాకుండా మరే ప్రాంతంలో పెట్టినా సీమ ప్రాజెక్టుల నిర్వహణతోపాటు స్థిరీకరణ విషయంలో ఈ ప్రాంత రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీనీవా సుజలా స్రవంతి, గాలేరు నగరి సుజలా స్రవంతి, వెలుగొండ, తెలుగు గంగ ప్రాజెక్టుల నిర్వహణతో పాటు శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిర్వహణ నియంత్రణ విషయంలో సీమ రైతాంగం నష్టపోకూడదంటే కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కేఆర్ఎంబీని కర్నూలులో ఏర్పాటు చేసే విషయంలో అఖిల పక్ష నాయకులు ఐక్యంగా ముందు సాగి ముక్త కంఠంతో నినదిస్తే తప్ప సీమ రైతులు జీవితాలు బాగుపడవని గుర్తు చేశారు. ఇప్పటికే రాష్ట్ర సగటుతో పోలిస్తే రాయలసీమ సాగు విస్తీర్ణ శాతం ఆందోళనకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

శానిటేషన్ సూపర్‌వైజర్ ఆత్మహత్యాయత్నం

స్టేట్‌మెంట్ రికార్డు చేసిన పోలీసులు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓ అధికారి వేధింపులు తట్టుకోలేక బుధవారం శానిటేషన్ సూపర్‌వైజర్ హర్షవర్ధన్ (28) ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. 40 నిద్రమాత్రలు మింగి అపస్మారక స్థితిలోకి వెళ్లిన సూపర్‌వైజర్‌ను తల్లిదండ్రులు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. నాల్గవ పట్టణ పోలీసులు గురువారం వచ్చి అతని నుంచి స్టేట్‌మెంటు రికార్డు చేశారు. ఓ అధికారి వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాత్నం చేసినట్లు ఆయన తెలిపారు. కొంత మంది పారిశుధ్య కార్మికుల మాటలు విని అధికారి వాళ్ల ఎదుటే అమర్యాదగా మాట్లాడతారని పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. శివరాత్రి పండుగ ఉన్నా మీటింగ్ కు రావాలని ఓ ఉద్యోగితో ఫోన్ చేయించి వేధించారని, ఇలాంటి ఒత్తిడిని తట్టుకోలేక నిద్రమాత్రలు మింగినట్లు స్టేట్‌మెంటు ఇచ్చాడు. ఈ ఘటనపై కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ అధికారులతో శానిటేషన్ కాంట్రాక్టరు చర్చించారు. ఈ సమావేశంలో ఓ అధికారి మాట్లాడుతూ శానిటేషన్ సూపర్‌వైజర్ ఆత్మహత్యాయత్నం గురించి పత్రికల్లో రాకూడదని హుకుం జారీ చేశారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ స్పందిస్తూ సదరు అధికారి తన మాటతీరు మార్చుకోవాలని అన్నారు.

కేశవ్.. కరుణ చూపేనా?

(5వ పేజీ తరువాయి)

పల్లె దాహం తీరాలంటే 'జల'సిరి కావాలి

ఉమ్మడి జిల్లాలో 804 పంచాయతీలు ఉన్నాయి. మరో 475కి పైగా మజారా గ్రామాలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 3,38,865, కర్నూలు జిల్లాలో 3.25 లక్షల జన నివాసాలు ఉన్నాయి. 25-30 శాతం ఇళ్ల కూడా కుళాయి కనెక్షన్లు లేవు. ఇప్పటికీ గ్రామీణ ప్రజలు వీధి కుళాయిలు, బోర్లు, వంకలు, వాగుల్లో చెలిమిలపై ఆధార పడుతున్నారు. ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం 'జల్ జీవన్ మిషన్ (జేజేఎం)' పథకం తీసుకొచ్చినా గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా లక్ష్యం నెరవేరలేదు. ఆయా జలాశయాల నుంచి శుద్ధి చేసిన తాగునీరు అందించేందుకు జేజేఎం కింద కర్నూలు జిల్లా నుంచి రూ.1,542 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.1,450 కోట్లకు పైగా నిధులు అవసరం ఉంది. సగ్రమ రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ సరేసరి.



ముళ్ల కంపలతో నిండిపోయిన పత్తికొండ జలాశయం

మెడికల్ కాలేజీలు పూర్తి చేయాలి

కర్నూలు సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీ భవనాలు, ఆదోని మెడికల్ కళాశాల, బోధనాస్పత్రి నిర్మాణాలు రూ.930 కోట్లతో చేపడితే.. వివిధ దశల్లో పనులు ఆపేశారు. కర్నూలు ప్రభుత్వం ఆస్పత్రిలో రోగులకు సరిపడా బ్లాకులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తి పనులు తక్షణమే పూర్తి చేయాలి. ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి చేస్తే పశ్చిమ ప్రాంత వాసులకు అనుకూలంగా ఉంటుంది.



హెడ్ స్లూయిస్ పనులతో ఆగిపోయిన ఆర్డీఎస్ కుడి కాలువ

రహదారుల శాశ్వత మరమ్మతులు చేపట్టాలి

రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ పర్యవేక్షణలోని రహదారులు గత వైసీపీ పాలనలో ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా గుంతల మయంగా మారాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే రోడ్ల గుంతలు పూడ్చింది. శాశ్వత మరమ్మతుల కోసం రోడ్లు భవనాల శాఖ కర్నూలు జిల్లాలో రూ.85 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.125 కోట్లు ఇవ్వాలిన ప్రతిపాదించారు. పంచాయతీరాజ్ (పీఆర్) కర్నూలు జిల్లాలో రూ.212 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.195 కోట్లు అవసరం ఉందని ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఈ నిధులు కాదని నాబార్డు కింద రోడ్ల విస్తరణ, ఆధునీకరణకు నిధులు ఇవ్వాలని ప్రతిపాదించారు.

నీటి తొట్టిలోపడి చిన్నారి మృతి

కన్నీరు మున్నీరైన తల్లిదండ్రులు



సూర్య(ఫైల్)

రుద్రవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : చిన్నారి బాబును ఇంటి దగ్గర వదిలి తల్లిదండ్రులు పొలానికి వెళ్లారు. పిల్లవాడు ఆడుకుంటూ వెళ్లి నీటి తొట్టిలోపడి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన చిన్నరాయుడు-నీరజ దంపతులకు ఇద్దరు మగ పిల్లలు. చిన్న కుమారుడు సూర్యకు ఏడాది వయసు. ఇద్దరు పిల్లలను ఇంట్లో వృద్ధురాలి దగ్గర వదిలేసి ఉదయాన్నే పొలం పనులకు వెళ్లారు. వృద్ధురాలు పక్కకు వెళ్లిన సమయంలో చిన్నారి సూర్య ఆడుకుంటూ వెళ్లి ఇంటి ముందు ఉన్న నీటి తొట్టిలో ప్రమాదవశాత్తు పడి ఊపిరాడక మృతి చెందాడు. ఈ సంగతి తెలిసి తల్లిదండ్రులు ఇంటికి వచ్చి మృతి చెందిన బాలుడ్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. వారి విషాదం గ్రామస్తుల కంట తడి పెట్టించింది.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

● జిల్లా వ్యవసాయ అధికారి వైవీ మురళీకృష్ణ

పగిడ్యాల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి కేంద్రీకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి వైవీ మురళీకృష్ణ అన్నారు. పగిడ్యాలలో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పగిడ్యాలకు చెందిన వెంకటేశ్వర్లు అనే రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో నందికొట్కూరు ఏడీఏ జయశంకర్, పగిడ్యాల వ్యవసాయ అధికారి విజయ జ్యోతి కుమార్ సిబ్బంది ఉన్నారు.

కాలువ మట్టిని తరలిస్తే చర్యలు తప్పవు

● హంద్రీనీవా కాలువ డీఈ శకుంతల

పగిడ్యాల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి మల్యాల హంద్రీనీవా కాలువకు నీటిని తరలించేందుకు ఏర్పాటు చేసిన లింకు కాల్వ మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని హంద్రీనీవా కాలువ డీఈ శకుంతల హెచ్చరించారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి హంద్రీ నీవా కాలువకు నీటిని విడుదల చేయనుండడంతో మండల పరిధిలోని నెహ్రూనగర్ సమీపంలో ఆమె గురువారం కాలువను పరిశీలించారు. సిబ్బంది కాలువ వెంట తనిఖీలు నిర్వహించి మట్టిని తరలించుకుపోయే వారి వివరాలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఏఈలు హరిప్రసాద్, హందర్, సిబ్బంది ఉన్నారు.

నాటు సారాయి లేకుండా చూడాలి

నందికొట్కూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరును నాటుసారాయి రహితంగా తీర్చిదిద్దేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు తమ వంతు కృషి చేయాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ జఫ్రుల్లా అన్నారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని స్త్రీశిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో నవోదయం 2.0 నాటు సారా నిర్మూలనపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సమగ్ర శిశు సంక్షేమ శాఖ అధికారి మంగవల్లి, సూపర్‌వైజర్లు వరలక్ష్మి, వెంకటేశ్వరి, రమణమ్మ పాల్గొన్నారు.

జీవన ధ్రువీకరణ పత్రాలను సమర్పించండి



ఆత్మకూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు సబ్ ట్రెజరీ పరిధిలోని విశ్రాంత ఉద్యోగులు ఫిబ్రవరి 28వ తేదీలోగా తమ జీవన ధృవీకరణ పత్రాలను సమర్పించాలని సబ్ ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్ సాజిద్‌బాషా అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు సబ్ ట్రెజరీ పరిధిలో ఇంకా 117 మంది ఇవ్వలేదని తెలిపారు. జీవన ధృవీకరణ పత్రం సమర్పణకు శుక్రవారం ఒక్కరోజు మాత్రమే గడువు ఉందని అన్నారు. మరిన్ని వివరాలకు 9440570313 నంబరును సంప్రదించాలన్నారు.

కంది పూతకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కొత్తపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కంది పంట పూత దశలో ఉన్నందున మచ్చల పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయాధికారి హేమలత రైతులకు సూచించారు. గురువారం కొక్కెరంచ, దుద్యాల గ్రామాల్లో ఏవో మహేశ్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు.

చిరుత పులికి పోస్టుమార్టం

సున్నిపెంట 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం పరిధిలోని రుద్ర పార్కు వద్ద గోడపై మృతి చెందిన చిరుత పులికి అటవీ అధికారులు గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. ఆ ప్రాంతంలో చిరుత పులి అవశేషాలు పడి ఉండటాన్ని గమనించామని శ్రీశైలం అటవీ సబ్ డివిజన్ అధికారి ఎం.మహమ్మద్ అబ్దుల్ రవూఫ్ తెలిపారు. చిరుత పులి మృతి చెందిన సంఘటనలో ఎలాంటి మానవ ప్రమేయం లేదని దర్యాప్తులో తేలిందని ప్రకటించారు.

మంత్రిని ఫరూక్‌ను కలిసిన వక్ఫ్‌బోర్డు చైర్మన్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను గురువారం తెలుగుదేశం పార్టీ కార్యాలయం మర్యాద పూర్వకంగా కలిశారు. నంద్యాల జిల్లా ఇమాంలు వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు ఘన స్వాగతం పలికారు. తమ సమస్యలను మంత్రితోపాటు వక్ఫ్ బోర్డు చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వక్ఫ్ భూముల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

స్నేహితుడు తిట్టాడని బావిలో దిగి నిరసన

ఆత్మకూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్నేహితుడు తిట్టాడని ఓ యువకుడు బావిలో దిగి నిరసన వ్యక్తం చేసిన సంఘటన గురువారం ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామంలో చోటు చేసుకుంది. కరివేన గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు శ్రీనివాసులు, గురువారం తమ గ్రామ సమీపంలోని ఎస్ఆర్‌బిసి కాలని లో స్నేహితుల మధ్య సాయంత్రం చిన్నపాటి వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలోనే శ్రీనివాసులును అతని స్నేహితుడు బూతులు తిట్టడంతో మనస్థాపానికి లోనై పక్కనే ఉన్న ఓ బావిలోకి సాయంత్రం 5 గంటల సమయంలో దిగాడు. దీంతో ఆందోళన చెందిన శ్రీనివాసులు స్నేహితులు బావి నుంచి పైకి రావాలని బతిమిలాడినా వినలేదు. ఈ విషయం గ్రామస్థులకు తెలియడంతో బావి వద్దకు భారీగా తరలివచ్చారు. గ్రామస్థులు సైతం బావిలో నుంచి పైకి రావాలని కోరినప్పటికి అతను ఎవరి మాట వినలేదు. చివరికి పోలీసులకు సమాచారం వెళ్లడంతో పోలీసులు అక్కడికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందిని పిలిపించారు. ఆ తరువాత పోలీసులు, ఫైర్ సిబ్బంది ఆ యువకుడికి సర్ది చెప్పి తాడు సహాయంతో బావిలో నుండి రాత్రి 8 గంటల సమయంలో పైకి తీసుకు వచ్చారు.

షాదీఖానా మరమ్మతులకు నిధులివ్వాలి



మంత్రిని కలిసిన మైనార్టీ నాయకులు

పాణ్యం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పాణ్యం ఎన్‌టీఆర్ షాదీ ఖానా మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని మంత్రి ఫరూక్ ను కోరినట్లు జిల్లా టీడీపీ ముస్లిం మైనార్టీ కార్యదర్శి ఖాదర్‌బాషా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో పాణ్యం బీసీ కాలనీలో నిర్మించిన ఎన్‌టీఆర్ షాదిఖానా మరమ్మతులకు రూ.16 లక్షలతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి ఎమ్మెల్యే గౌరు చరిత సహకారంతో పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీస్, అబ్దుల్ ఫరూక్ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో రుద్రాణి సమేత రుద్రకోటేశ్వర స్వామి



ఓంకారంలో భక్తుల రద్దీ



రుద్రకోటేశ్వర క్షేత్రంలో కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు



సంజీవనగర్ రామాలయంలో శివపార్వతుల కల్యాణం

కల్యాణ వైభోగం

● ఘనంగా పార్వతీ పరమేశ్వరుల పెళ్లి వేడుక

ఆత్మకూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన అతి ప్రాచీన రుద్రకోటేశ్వర స్వామి ఆలయంలో గురువారం రుద్రాణి సమేత రుద్రకోటేశ్వర స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ప్రతిఏటా మహా శివరాత్రి మరుసటి రోజున స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆలయ పురోహితులు యజ్ఞనారాయణ శర్మ పర్యవేక్షణలో అశేష భక్త జనం నడుమ స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు సంప్రదాయబద్ధంగా కళ్యాణ క్రతువును చేపట్టారు. అనంతరం కళ్యాణ మూర్తులకు ఆలయ ప్రాంగణంలో పల్లకి సేవ నిర్వహించారు. కాగా బుధవారం అర్ధ రాత్రి గర్భాలయంలోని రుద్రకోటేశ్వర స్వామికి లింగోద్భవ పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. అదేవిధంగా క్షేత్రంలోని సీతా రామలక్ష్మణస్వామికి, నాగులపుట్టకు, కల్పవృక్షానికి భక్తులు పూజలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే కొనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. ఇదిలావుంటే మహాశివరాత్రి జాగరణను పురస్కరించుకుని క్షేత్రంలో నిర్వహించిన పౌరాణిక నాటకాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

● **ఆత్మకూరు రూరల్:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వెంకటాపురం గ్రామంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం గురువారం కమనీయంగా సాగింది. ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో శివ పార్వతుల ఉత్సవ మూర్తులను కళ్యాణ మూర్తులుగా అలంకరించి వేద మంత్రోచ్చారణల నడుమ గణపతి పూజ, పుణ్యాహ వచనం, కంకణధారణ, కన్యాదానం, మహా సంకల్పం, శిరస్సున జిలకర బెల్లం, మాంగల్యధారణ, అక్షతారోహణం, మహా మంగళహారతితో కళ్యాణ వేడుకలను కుందూరు నాగేశ్వరరెడ్డి, అరుణమ్మ దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణం చుట్టూ గ్రామస్థుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగించారు. అనంతరం వసంతోత్సవంతో మహా శివరాత్రి వేడుకలను ముగించారు.

● **గడివేముల:** మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో గురువారం వేకువ జామున దుర్గాభోగేశ్వరుడి కల్యాణం కమణీయంగా జరిగింది. ముత్యాల తలంబ్రాలు, మంగళ వాయిద్యాలు, విశేష అలంకరణలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వృషశృంగ మహర్షి కల్యాణం పెద్దగా వ్యవహరించగా, సూర వెంకట రమణారెడ్డి దంపతులు స్వామి వారి తరపున, కంది శ్రీనివాసులు దంపతులు, రొడ్డ నాగేష్ దంపతులు అమ్మవారి తరపున ఉండగా భక్తుల ఓంకార నామస్మరణల మధ్య స్వామి, అమ్మవారి కల్యాణం వైభవంగా జరిగింది. దుర్గాభోగేశ్వర ఆలయంలో గురువారం ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ యువ నాయకులు గౌరు జనార్దన్‌రెడ్డి లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రామానుజన్, ఆలయ ప్రధాన అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మలు ఎమ్మెల్యే గౌరు చరితకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే గౌరుచరిత, టీడీపీ యువ నాయకులు గౌరు జనర్దాన్‌రెడ్డి, చిందుకూరు సర్పంచ్ అనసూయమ్మ, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి దుర్గాభోగేశ్వరుడికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

నంద్యాల కల్చరల్: నంద్యాలలోని పలు ఆలయాల్లో బుధవారం అర్ధరాత్రి వరకు శివయ్యకు అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అర్చనలు, లింగోద్భవ పూజలు నిర్వహిచారు. అనంతరం గురువారం తెల్లవారుజామున వైభవంగా శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. సంజీవనగర్ రామాలయంలో భగవత్ సేవా సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో, ప్రథమ నందీశ్వరాలయంలో అర్చకులు ప్రవీణ్‌కుమార్, భక్తుల ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు.

● **కొత్తపల్లి:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తపల్లి మండల సరిహద్దులోని సప్తనదుల సంగమేశ్వరంలోని ఎగువ ఉమా మహేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ కళ్యాణ తంతు కార్యక్రమాన్ని కమనీయంగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో రెండో రోజైన గురువారం అశేష భక్త జనవాహిని మధ్య అభిజిత్ ముహూర్తాన భాజా భజంత్రీలు, వేద మంత్రోచ్చారణల మధ్య పురోహితులు కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ ఏడాది శివరాత్రికి కృష్ణా నది నీటిలో నిక్షిప్తమైన పాత సంగమేశ్వరాలయం బయల్పడక పోవడంతో ఎగువ ఉమామహేశ్వర స్వామి ఆలయంలోనే కళ్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి.

● **పాణ్యం:** మహాశివరాత్రి సందర్భంగా సుబ్బరాయుని కొత్తూరులో పార్వతీ నాగలింగేశ్వరస్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. గురువారం వేకువ జామున లింగోద్భవ కాలమందు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాణ్యం పాణికేశ్వరస్వామి కళ్యాణం గురువారం తెల్లవారు జామున ఘనంగా నిర్వహించారు. లింగోద్భవ కాలమందు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, భక్తులకు పానకపందేరం నిర్వహించారు. స్వామివారికి నెరవాడ శిరిగిరి ప్రసాదరెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు ఆలయ ఈఓ సువర్ణ ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అలాగే రైల్వే గేటు సమీపంలోని మంజునాథ ఆలయంలో స్వామివారి కళ్యాణోత్సవం ఆలయ ధర్మకర్త వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

● **జూపాడుబంగ్లా:** మండలంలోని తూడిచర్ల గ్రామంలో వెలసిన భ్రమరాంబ శంకరమల్లేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం గురువారం తెల్లవారుజామున భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మధ్యాహ్నం మహిళలు తూడిచర్ల గ్రామం నుంచి దేవాలయం వరకు మేళాతాళాలతో బోనాలను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తంగడంచ గ్రామంలో విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథస్వామి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది.

● **బండిఆత్మకూరు:** మండలంలోని ఓంకారం, విష్ణు నంది, శివనంది క్షేత్రాల్లో రెండో రోజు భక్తుల రద్దీ కొనసాగింది. గురువారం ఉదయం నుంచి ఆయా క్షేత్రాలకు పలు ప్రాంతాల నుంచి భక్తుల రాక కొనసాగింది. స్వామి వార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఓంకారంలో నంది వాహనంపై గంగా, ఉమా సమేత సిద్దేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులను కొలువు దీర్చి క్షేత్రోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈవోలు నాగప్రసాద్, వేణునాథరెడ్డి చైర్మన్ తిరుపంరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.



తంగడంచలో రథోత్సవం



వెంకటాపురంలో..



సప్తనదీసంగమంలో సంగమేశ్వరుడి కళ్యాణం నిర్వహిస్తున్న పురోహితుడు తెలకపల్లి రఘురామశర్మ

గంటల తరబడి ప్రయాణికుల పడిగాపులు

శ్రీశైలం (కోడుమూరు రూరల్), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు పాగాలంకరణ, కల్యాణం, రథోత్సవం అనంతరం స్వగ్రామాలకు తిరుగుముఖం పట్టారు. బ్రహ్మోత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు తదితర చోట్ల నుంచి తరలివచ్చారు. గురువారం తెల్లవారు జామున కల్యాణం అనంతరం కొందరు, సాయంత్రం రథోత్సవం పిదప భక్తులు బస్టాండ్‌కు వెళ్లారు. దీంతో ఉదయం నుంచి బస్టాండ్ ప్రాంగణం నిండిపోయింది. రోడ్డుపక్కన చెట్ల కింద పలువురు బస్సు ల కోసం గంటలపాటు ఎదురు చూస్తూ ఉండిపోయారు. ఎంక్వైరీ దగ్గర బస్సుల వివరాలను కనుక్కుంటూ గడిపారు. మరోవైపు ఎండ కారణంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అడపాదడపా వచ్చిన బస్సుల్లో సీట్ల కోసం ప్రయాణికులు ఎగబడ్డారు.



బస్సుల కోసం బస్టాండ్‌లో పడిగాపులు కాస్తున్న భక్తులు

అందరి కృషి అభినందనీయం

శ్రీశైలం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పోలీసు యంత్రాంగం కృషితో అభినందనీయమని జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు. భద్రత, క్షేమమే లక్ష్యంగా హోంగార్డు స్థాయి నుంచి అడిషనల్ ఎస్పీ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ నిర్విరామంగా కృషి చేశారని చెప్పారు. ముఖ్యంగా గురువారంతో రథోత్సవం కన్నుల పండుగగా జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ప్రతేకంగా అభినందిస్తున్నామని చెప్పారు.

రాష్ట్ర స్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు

● ప్రారంభించిన మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్

మహానంది, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహానంది మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల రైతు కమిటీ ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలను మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ గురువారం ప్రారంభించారు. గురువారం మహానంది సమీపంలోని ఎద్దుల బల ప్రదర్శన క్రీడా మైదానంలో సీనియర్స్ విభాగం ఎద్దుల బలప్రదర్శన పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ కమిటీ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి, ఎంపీపీ యశస్వీని తదితరులు పాల్గొన్నారు.



ఎద్దుల బల ప్రదర్శన పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూఖ్

మహానంది: సీనియర్స్ ఎద్దుల బల ప్రదర్శన పోటీల్లో నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభంతోపాటు తెలంగాణ రాష్ట్రం హుజూర్‌నగర్‌కు చెందిన వృషభం కంబైన్ జతగా 2342 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం దక్కించుకున్నట్లు మండల రైతు కమిటీ సభ్యులు తెలిపారు. శిరివెళ్ల మండలం గుంపరమానుదిన్నె గ్రామానికి చెందిన కందూరు రాంభూపాల్‌రెడ్డి వృషభాలు ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలైన ఎద్దుల యజమానులు ప్రథమ బహుమతి రూ.1.25 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.80 వేలు దక్కించుకున్నారు.

లడ్డూ పోటులో ప్రమాదం ?

నంద్యాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థాన లడ్డుపోటు కేంద్రంలో ప్రమాదం జరిగినట్లు ఆలస్యంగా తెలిసింది. వివరాలివి. ఈనెల 25న ఉదయం 6 నుంచి 7 గంటల మధ్యప్రాంతంలో కార్మికులు లడ్డూ తయారీ కోసం కేంద్రంలో గ్యాస్ వెలిగించారు. అయితే గ్యాస్‌పైప్ బిగువులేక మంట బయటకు చొచ్చుకొచ్చింది. దీంతో గ్యాస్ పొయ్యి వద్ద ఉన్న ముగ్గురు కార్మికులకు మంట తగిలి కాళ్లకు గాయాల య్యాయి. వెంటనే అప్రమత్తమైన మిగిలిన కార్మికులు వాల్వ్ ఆఫ్ చేయడంతో ప్రమాదం తప్పింది. గాయపడిన కార్మికులను పోటు కేంద్ర సిబ్బంది దేవస్థాన ఆసుపత్రికి తరలించారు. బాధితులకు చికిత్స చేయించారు. విషయం బయటకు పొక్కకుండా కార్మికులను సొంతూళ్లకు పంపించినట్లు తెలిసింది. ఈ విషయమై దేవస్థాన అధికారులు అటువంటిదేమి లేదని చెబుతున్నారు.



విష్ణునందిలో పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ చిట్టిబొట్ల భరద్వాజశర్మ

ఉత్సాహంగా సాగిన పోటీలు

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శైవ క్షేత్రాల్లో వివిధ విభాగాల రాష్ట్ర స్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నువ్వా, నేనా అన్న రీతిలో ఉత్సాహంగా సాగాయి. మండలంలోని విష్ణు నందిలో పాళదూళ్ళ విభాగపు పోటీలను శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు డాక్టర్ చిట్టిబొట్ల భరద్వాజశర్మ, ఓంకారంలో న్యూకేటగిరి విభాగం పోటీలను నిర్వాహకులు ఈశ్వరరెడ్డి, సాయిబాబారెడ్డి, నిరంజన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శివనందిలో పాళదూళ్ల విభాగపు పోటీలను టీడీపీ నాయకులు మనీష్‌రెడ్డి, మధన్‌భూపాల్, నాగేశ్వరరావు, మల్లికార్జున ప్రారంభించారు. ఈపోటీలు ఆద్యంతం చివరి వరకు పలు జట్ల మధ్య నువ్వా, నేనా అన్న రీతిలో కొనసాగాయి. గెలుపొందిన విజేతలకు నిర్వహకు్లు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమాల్లో తోట శివయ్య, వెంకటాపురం శీను, బాలుడు, చెలమయ్య, శ్రీకాంత్ రెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.



పలుకూరు రామేశ్వర ఆలయంలో కల్యాణంలో పాల్గొన్న దంపతులు



ముచ్చట్లలో మల్లికార్జునస్వామి అమ్మవార్లకు తలంబ్రాలు పోస్తున్న చైర్మన్ దంపతులు



డోన్ పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు తలంబ్రాలు పోస్తున్న దంపతులు

కమనీయం శివపార్వతుల కల్యాణం

- తరలివచ్చిన భక్తులు

డోన్ రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం, కోట్లవారిపల్లె గ్రామ పరిధిలో ఉన్న కొత్తబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో గురువారం ఉదయం శివపార్వతుల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం ధర్మకర్త బైసాని రాజు, కొత్తబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కోట్రికే హరికిషన్‌ల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అలాగే కమలాపురం గ్రామంలో శివాలయంలో గురువారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. హైదరాబాదు నుంచి ప్రత్యేకంగా వచ్చిన కళాకారుల బృందంతో పాటలు, నృత్యాలు, డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు భక్తులను అలరించారు. నందికోల ఉత్సవాలు ఘనంగా ముగిశాయి.

బేతంచెర్ల: మండలంలోని డోన్ రహదారిలో హెచ్ కొట్టాల గ్రామ శివారులో ప్రకృతి కొండల నడుమ వెలసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి, ఎంబాయ గ్రామ శివారులో వెలసిన భోగేశ్వరస్వామి, నీలకంఠేశ్వరస్వాముల ఆలయాల్లో శివపార్వతులకు కల్యాణం ప్రధాన అర్చకుడు చంద్రమోహన శర్మ, చంద్రశేఖర శర్మల వేద మంత్రోచ్ఛరణాల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. అలాగే ముచ్చట్ల మల్లికార్జున స్వామికి బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్‌బాబు దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మద్దిలేటి ఆలయ మర్యాదలతో సీఐ, ఎస్ఐ దంపతులకు శేష వస్త్రాలతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్యాపిలి: మండలంలోని ప్యాపిలి, ఏనుగమర్రి, కాకనవరం, చంద్రపల్లి, జలదుర్గం, పెద్దపూదిళ్ల తదితర గ్రామాల్లోని శివాలయాల్లో గురువారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం శివపార్వతుల విగ్రహాల గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

బనగానపల్లె: మండలంలోని పలుకూరు గ్రామంలో శివరాత్రి వేడుకల సందర్భంగా శ్రీరామేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణోత్సవం ఆలయ పూజారి భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని బుగ్గమల్లేశ్వర, రామలింగేశ్వర ఆలయాల్లో గురువారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణోత్సవం వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. రామలింగేశ్వర ఆలయంలో ఉభయదారులు మురళి, నరసింహా రావు, సంజీవకుమార్, భాస్కర్‌రెడ్డి దంపతులచే కల్యాణం చేయించారు. బుగ్గమల్లేశ్వర ఆలయంలో ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానిదేవి ఆధ్వర్యంలో విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు శివప్రసాద్, కోశాధికారి నవతాప్రసాద్, ఉపాధ్యక్షుడు జాలయ్య, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



చాగలమర్రిలో శివపార్వతుల కల్యాణం చేస్తున్న వేద పండితులు, దంపతులు

దొర్నిపాడు: మండల కేంద్రంలోని భవాని సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతులకు కల్యాణం నిర్వహించారు. అనంతరం పురోహితులు నాగేశ్వరశర్మ, శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రుద్రవరం : నల్లమల అటవిలోని ఉల్లెడ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఉల్లెడ మల్లేశ్వరస్వామి, పార్వతీదేవి కల్యాణం కమణీయంగా సాగింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో గురువారం శివాలయంలో శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. మరోవైపు బెలుం గ్రామంలో వెలసిన పురాతన సిద్ధరామేశ్వరస్వామి ఆలయంలో పెద్ద ఎత్తున అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గంగను ధరించిన శివుడి రూపంలో స్వామి వారిని అలంకరించి, పుష్పాభిషేకం చేశారు.



ఎంబాయిలో స్వామిఅమ్మవార్ల కల్యాణం



దొర్నిపాడు, ప్యాపిలిలో గ్రామోత్సవం



అంకిరెడ్డిపల్లెలో శివపార్వతుల కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

అహోబిలం చేరుకున్న దేవదేవుడు

- 45 రోజులపాటు 32 గ్రామాల్లో సాగిన పార్వేట
- శాస్త్రోక్తంగా లఘు సంప్రోక్షణం, ప్రాయశ్చిత్త హోమం
- అహోబిలేశుడి రాకతో పులకించిన భక్తజనం



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న ప్రధాన అర్చకులు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : దుష్ట శిక్షణ.. శిష్ట రక్షణతో పాటు తన వివాహ మహోత్సవానికి తరలిరావాలని భక్తులను ఆహ్వానించేందుకు పార్వేటకు బయలుదేరి వెళ్లిన అహోబిలేశుడు గురువారం తిరిగి అహోబిలం క్షేత్రానికి చేరుకున్నాడు. స్వా మివారి పార్వేట పల్లకి బుధవారం రాత్రి రుద్ర వరం నుంచి బయలుదేరి వచ్చి గండ్లేరు వద్ద రహదారిపైకి చేరుకుంది. ఉదయం వరకు స్వా మివార్లు అక్కడ సేదతీరి అహోబిలానికి పయనమయ్యారు. భారతదేశంలో ఎక్కడా జరగని విధంగా దాదాపు 45 రోజులపాటు 32 గ్రామాల్లోని భక్తుల చెంతకే భగవంతుడు వెళ్లి దర్శన భాగ్యం కల్పించిన జ్వాలా, ప్రహ్లాదవరద స్వామి ఉత్సవమూర్తుల పార్వేట పల్లకి అహో బిలం చేరుకోవడంతో వేద మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు, భక్తులు ఘనంగా స్వాగతం పలికా రు. దిగువ అహోబిలంలోని మఠంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆరగింపు చేపట్టారు. అక్కడి నుంచి పార్వేట పల్లకిని ఆలయ ప్రదక్షిణగా గర్భగుడి సమీపంలోకి తీసుకునివచ్చారు. అక్కడ ఆగమశాస్త్రం ప్రకారం సంప్రోక్షణ నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఆళ్లగడ్డ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవి కాంత్ చౌదరి ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో హోమం

గ్రామగ్రామాన సంచరించి దిగువ అహోబిలం చేరుకున్న జ్వాలా, ప్రహ్లాదవరద స్వామి ఉత్సవ మూర్తులకు వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించిన సమయంలో కలిగిన దోషాల ప్రాయశ్చిత్తం కోసం 108 కలశాలతో పంచామృతాభిషేకం, లఘు సంప్రోక్షణం, కుంభప్రోక్షణ, ప్రాయశ్చిత్త హోమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ మేనేజర్ మురళీధరన్, ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్య నారాయణన్, మధుసూదన్, సంతానం, మారన్ శఠగోపన్ శ్రీవాత్సవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జ్వాలా నరసింహస్వామి దిగువ అహో బిలం నుంచి గురువారం సాయంత్రం ఎగువ అహోబిలం చేరుకున్నాడు. అక్కడ స్వామివారికి అభిషేకం, అర్చన, విశేష పూజలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

3నుంచి బ్రహ్మోత్సవాలు

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 3 నుంచి 15 వరకు నిర్వహించేందుకు మఠం నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అహోబిలం మఠం 46వ పీఠాధిపతి పర్యవేక్షణలో ఫాల్గుణ శుద్ధ పంచమి నుంచి పౌర్ణమి వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో 4న అంకురార్పణం, 5న ధ్వజారోహణం, 11న ఉదయం తిరుమంజనం, రాత్రి జ్వాలా నరసింహస్వామి, చెంచులక్ష్మీ అమ్మవారి ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం, 13న రథోత్సవం, 14న గరుడోత్సవం నిర్వహించనున్నారు. అలాగే దిగువ అహోబిలంలో 5న అంకురార్పణం, 6న ధ్వజారోహణం, 12న రాత్రి ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవారి ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం, 14న రథోత్సవం, 15న గరుడోత్సవం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల అనంతరం మార్చి 16 నుంచి 18వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం ప్రహ్లాదవరదస్వామి తెప్పోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

మాట నిలబెట్టుకున్నాం

- మౌజం, ఇమాంలకు గౌరవ వేతనం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే
- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె , ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం సీఎం నారా చంద్రబాబునాయుడు మౌజం, ఇమాంలకు గౌరవవేతనం విడుదల చేసి ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం మంత్రి బీసీ క్యాంపు కార్యాలయ ఆవరణంలో మండలంలోని మౌజం, ఇమాంలు మంత్రి బీసీని శాలువాతో సత్కరించారు. గౌరవవేతనం విడుదల చేసినందుకు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా బీసీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ముస్లింల వ్యతిరేకి అని గతంలో వైసీపీ ప్రభుత్వం దుష్ప్రచారం చేసిందన్నారు. అయినా ముస్లింలు తెలుగుదేశం పార్టీకి పూర్తిస్థాయిలో మద్దతు ఇచ్చారన్నారు. ముస్లిం మైనార్టీ అభివృద్ధికి, సంక్షేమానికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు. బనగానపల్లె పట్టణంలో ముస్లింల కోసం షాదీఖానా పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అలాగే మదర్సా కూడా ఏర్పాటు చేసి పేద ముస్లింల పిల్లలకు విద్యనభ్యసించేలా ప్రత్యేక గదులు ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇమాంల గౌరవవేతనం రూ.10వేలు, మౌజం వేతనం రూ.5వేలు కొనసాగిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. మసీదులకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే సొంతనిధులు ఖర్చు పెట్టి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. అలాగే అర్హులకు త్వరలోనే ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. సమావే శంలో ఉపసర్పంచ్ బురానుద్దీన్, అమీర్‌జాన్, అహమ్మద్‌హుసేన్, అల్తాఫ్‌హుసేన్, అధిక సంఖ్యలో మౌజం, ఇమాంలు పాల్గొన్నారు.



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని సన్మానిస్తున్న బనగానపల్లె పట్టణ ఇమాం, మౌజమ్‌లు

వచ్చారు..చూశారు.. వెళ్లారు

- సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని పరిశీలించిన ఉమ్మడి జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి

అవుకు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : అవుకు రిజర్వాయర్ సమీపంలో నిర్మించిన కమ్యూనిటీ ప్రాజెక్టు వాటర్ సప్లయ్ (సీపీడబ్ల్యూఎస్) పథకాన్ని ఉమ్మడి జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ పథకాన్ని పర్యవేక్షిస్తున్న బనగానపల్లె ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూధన్, ఏఈ సాయికృష్ణ సీఈవో పర్యటన విషయాన్ని గోప్యంగా ఉంచారు. అలా వచ్చారు..చూశారు..వెళ్లారు అనేవిధంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల్లోని ఫ్లోరైడ్ బాధిత 50 గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని ఏర్పాటు చేశారు. ఈ పథకం నిర్మాణం కోసం 2008 నుంచి 2023 వరకు ఫేస్ 1- కింద రూ. 10 కోట్లు, ఫేస్ 2- కింద రూ. 18 కోట్లు, ఫేస్ 3- కింద రూ. 8.50 కోట్లు మొత్తం రూ. 36.50 కోట్లు ఖర్చు చేశారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన నీటి పథకాన్ని పర్యవేక్షించేందుకు వచ్చిన సీఈవో ఎందుకు వచ్చారు, ఏం మాట్లాడారు అనే విషయాలు చెప్పే అధికారులు కరువయ్యారు. వేసవి ప్రారంభం కాక ముందే కొలిమిగుండ్ల, సంజామల మండలంలో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. దీంతో చాలా గ్రామాల్లో తాగునీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అవుకు మండలంలోని చెర్లోపల్లెలో ఎస్సీ కాలనీ, బీసీ కాలనీలకు నీరు అందటం లేదు. మర్రికుంట కుంటతండాలో నీటి సమస్య జఠిలంగా ఉంది. తాగునీరు అందని గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎలాంటి చర్యలు చేపడుతున్నారో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని పరిశీలిస్తున్న సీఈవో నాసరరెడ్డి

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

బనగానపల్లె: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయన్ని జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి గురువారం తనిఖీ చేశారు. కార్యాలయం సమీపంలోని రికార్డు గదులను పరిశీలించారు. అలాగే వాటర్‌స్కీంకు సంబంధించిన సామగ్రిని పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి మూడవ శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో రమణను ఆదేశించారు. మండలంలోని టంగుటూరు, యాగంటిపల్లె స్కీంల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్, ఏఈ సాయికృష్ణ, సూపరింటెండెంట్ నాగరాజు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి

ప్యాపిలి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయ అధికారి రాజేష్ అన్నారు. గురువారం మండలంలోని చంద్రపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రాజేష్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువు రైతులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా జమాల్ రాజా

శిరివెళ్ల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా శిరివెళ్ల ఒకటవ వార్డుకు చెందిన జమాల్ రాజా నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి నియోజకవర్గాల్లోని మండలాల అధ్యక్షులను ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా జమాల్ రాజా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పూర్వవైభవానికి కృషి చేస్తానన్నారు. పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రేణుకా ఎల్లమ్మకు వెండి వడ్డాణం

డోన్ టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండపేటలో రేణుకా ఎల్లమాంబేశ్వరి అమ్మవారికి రాజా కాంప్లెక్స్ అధినేత మహేష్‌గౌడు దంపతులు వెండి వడ్డాణం ఆలయ ప్రధాన సేవలకులు ఏఈ నాగరాజు గౌడుకు అందించారు. అదేవిధంగా చింతలపేట గ్రామానికి చెందిన నర్సిరెడ్డి ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మండల టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉంగరానిగుండ్ల మల్లికార్జున అమ్మవారికి 108 స్టీల్‌ప్లేట్లు, గ్లాసులను అందించారన్నారు. అదే విధంగా పత్తికొండ నీటి పారుదల శాఖలో పని చేస్తున్న సూపరింటెండెంట్ కేఎం మురళి రూ.25వేలు విలువ చేసే ఇనుపగేటును తయారు చేసి అందించినట్లు ఆయన తెలిపారు. అంతకుముందు మల్లికార్జున గౌడు, శేషన్న గౌడు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలుచేశారు.



రేణుకా ఎల్లమ్మను అలంకరిస్తున్న భక్తురాలు

వినియోగదారుడే ఉత్పత్తిదారుడు

చాగలమర్రి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ద్వారా గృహ వినియోగదారుడు విద్యుత్ ఉత్పత్తిదారుడిగా మారే అవకాశం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ రమణయ్య తెలిపారు. గురువారం చాగలమర్రి విద్యుత్ కేంద్రంలో విద్యుత్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాయితీతో సౌర విద్యుత్ సులభతరం చేసిందని అన్నారు. ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విద్యుత్ బకాయిలు సకాలంలో వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య లేకుండా చూడాలని అన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చాగలమర్రి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేపీ తండా గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ట్రెంచ్ గుంతలో విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందింది. బాధితులు రాజునాయక్, వెంకటేష్‌నాయక్ అటవీశాఖ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వగా ఆవు మృతదేహాన్ని పరిశీలించారు.

ఇద్దరు అరెస్టు

డోన్ రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): డోన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ప్యాపిలి మండలం ఆలేబాదుతాండా వెంగలాంపల్లి గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఆలేబాదుతండాలో శంకర్ నాయక్, వెంగలాంపల్లి గ్రామంలో తిప్పన్నను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి మద్యం, బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు.

వైభవంగా ఆరాధనోత్సవాలు

డోన్ రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణం సమీపంలోని రామచంద్ర మాలిక్‌బాబా దేవస్థానం సంస్థానంలో స్వామివారి ఆరాధనోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. సంస్థాన్ సభ్యులు స్వామివారి సమాధిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, మంగళహారతులు చేసి పూజలు చేశారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోవెలకుంట్ల మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. గురువారం పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ లాంటి పథకాలకు తప్పని సరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 13వేల పట్టాదారులకు గాను ఐదువేలమంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం పరిశీలన

బేతంచెర్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు మార్చి ఒకటి నుంచి ప్రారంభం అవుతున్నాయని చీఫ్ సూపరింటెండెంట్ మరియదాసు గురువారం తెలిపారు. గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని డిపార్టుమెంట్ ఆఫీసర్ రాజా దిలీప్ కుమార్ కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి సోమశేఖర్, సిబ్బంది ఉన్నారు.

వదంతులు నమ్మొద్దు

డోన్ టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండు వద్ద చికెన్ వ్యాపారస్థులు దాదాపు 400 కేజీల చికెన్, గుడ్లు, మూడు రకాల వంటలు చేసి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ అంటూ వస్తున్న వదంతులను నమ్మొద్దని సూచించారు. నిర్భయంగా చికెన్ తినవచ్చని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

చాగలమర్రి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబోదనం, మద్దూరు గ్రామాల మధ్య కాశీనాయన ఆశ్రమ సమీపంలో 41వ జాతీయ రహదారిపై వెళ్తున్న నసీమూన్ అనే మహిళను గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో నసీమూన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాల వైద్యశాలకు తరలించామని ఏఎస్ఐ నబీరసూల్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

హరివరంలో 'పొలం పిలుస్తోంది'

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శనగ పంట కోత అనంతరం రైతులు తమ పొలాల్లో లోదుక్కులు దున్నుకోవాలని కోవెలకుంట్ల డివిజన్ ఏడీఏ సుధాకర్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం హరివరం గ్రామంలో పర్యటించి రైతులతో ఆయన మాట్లాడారు. వేసవిలో లోదుక్కుల వల్ల వేరు పురుగు నశిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, వీఏఏ సిద్ధిక్ బాషా, రైతులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెట్నికోట సమీపంలోని గుండు మల్లేశ్వరస్వామి సన్నిధిలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి గురువారం ప్రారంభించారు. పోటీల్లో ఏడు జతల ఎద్దులు పాల్గొన్నాయి. మొదటి బహుమతిగా రూ.30 వేలు కడప జిల్లా ఎద్దులు గెలుపొందాయి. ద్వితీయ బహుమతి రూ.20వేలు దొర్నిపాడుకు చెందిన బత్తుల మనోహర్ యాదవ్ ఎద్దులు గెలుపొందాయి, తృతీయ బహుమతి రూ.10 వేలు సంజామల మండలం ముక్కమల్ల చంద్రశేఖరరెడ్డి ఎద్దులు దక్కించుకున్నాయి. చతుర్థ బహుమతి రూ.5వేలు బేతంచర్ల మండలం అంబాపురానికి చెందిన కురువ వెంకటరాముడు ఎద్దులు గెలుచుకున్నాయి. విజేతలకు జడ్పీ చైర్మన్ ఎర్రబో తుల పాపిరెడ్డి, ఉదయ్‌భాస్కరరెడ్డి నగదు బహుమతులు అందజేశారు.

ముగిసిన రాతిదూలం..

ప్యాపిలి: మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో మహాశివ రాత్రి సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి రాతిదూలం పోటీలు గురువారం ముగిశాయి. 15 జతల ఎద్దులు ఈ పోటీల్లో పాల్గొనగా, అనంతపురం జిల్లా తాడిమర్రి గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి ఎద్దులు మొదటి స్థానంలో నిలవగా డోన్ మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన కంబయ్య వృషభాలు రెండవ స్థానంలోను, కర్నూలు మండలంలోని బోగోలు చెందిన షేక్‌షైమున్నా వృషభాలు మూడవ స్థానంలో నిలిచాయి. నిర్వాహకులు మెట్టు పురుషోత్తం రెడ్డి, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, చంద్రకళారెడ్డి పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల